క్లుప్తంగా

తుపాన్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి

మణుగూరుటౌన్: మిచౌంగ్ తుపాన్ ఉధృతం నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని పినపాక నియోజకవర్గం నుంచి గెలుపొందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆయన ఈ మేరకు ప్రకటన విడుదల చేసి మాట్లాడారు. మిచౌంగ్ తుపాన్ ఉధృతంగా వస్తున్న నేపథ్యంలో రైతులు పంట నష్టం జరగకుండా తగిన ఏర్పాట్లలో నిమగ్నం కావాలన్నారు. తుఫాన్ కారణంగా ఆస్తినష్టం, పంట నష్టం జరిగితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో సహా ఆర్డీవో, వ్యవసాయ, ఉద్యానవన, వాణిజ్య పంటలు, విద్యుత్, వైద్యశాఖల అధికారులతో మాట్లాడి తగిన ఏర్పాట్లపై చర్చించినట్లు తెలిపారు. అత్యవసర సేవలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం 08744-241950 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రేవంత్‌రెడ్డి ఎంపికపై సంబురాలు

అశ్వాపురం: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ శాసన సభ పక్ష నాయకుడుగా రేవంత్‌రెడ్డిని పార్టీ అధిష్టానం ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం సంబురాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, నాయకులు ఓరుగంటి రమేష్, ఎస్‌కె.ఖదీర్, చంద్రకళ, మురళి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేలలను కాపాడుకోవాలి

గుండాల: రసాయనక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువుల ద్వారా నేలలను కాపాడుకోవచ్చని కోరమండల్ సేల్స్ ఆఫీసర్ మానాల వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కోరమండల్ వారి అధ్వర్యంలో హనుమాన్ ఎరువులు, విత్తనాల దుకాణం వద్ద మంగళవారం రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సు లో వారు మాట్లాడుతూ.. భూసార పరీక్షలు చేయించి వాటి ఫలితాలు ఆధారంగా ఎరువులు వాడుకోవాలరు. రసాయనిక ఎరువుల వాడకన్ని తగ్గించి ఆర్గానిక్ ఎరువులు వాడుకోవలని సూచించారు. కార్యక్రమంలో మనాల ప్రణీత్, ఫణి రామ్ కుమార్ , మధు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలను కలిసిన స్థానిక నాయకులు



హైదరాబాద్‌లో తుమ్మల నాగేశ్వరావును కలిసిన కాంగ్రెస్ నాయకులు

చర్ల: ఖమ్మం ఎమ్మెల్యేగా గెలుపొందిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును చర్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. చర్ల మండలానికి చెందిన డీసీఎంఎల్ డైరెక్టర్ పరుచూరి రవికుమార్, చర్ల సహకార సంఘ డైరెక్టర్ పంధిళ్లపల్లి రాధాకృష్ణ, ఎస్సీ సెల్ నాయకులు తోటమళ్ల రవికుమార్ హైదరాబాద్‌కు వెళ్లి ఆయన నివాసంలో కలిసి బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు.

సానుకూలంగా స్పందించిన ఆయన పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్యతో కలిసి భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి ఉంచుతామని తుమ్మల పేర్కొన్నట్లు వారు తెలిపారు.

12 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవితో నాయకులు

అశ్వాపురం: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18, 19 తేదీల్లో మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి నాయకత్వంలో జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో సోమాజిగుడ ప్రెస్ క్లబ్‌లో మాదిగ జేఏసీ సమావేశంలో పిడమర్తి రవితో కలిసి గద్దల నాగేశ్వరరావు, సీనియర్ నాయకుడు సిద్దెల తిరుమలరావు పాలొని మాట్లాడారు.

రైతును ముంచిన 'మిచాంగ్'



చంద్రుగొండ: రావికంపాడులో మిర్చి తోటలోనికి చేరిన వర్షపునీరు



అశ్వారావుపేటరూరల్: తిరుమలకుంటలో వర్షంతో తడిసిన వేరుశనగ పనలు



అన్నపురెడ్డిపల్లి: మిరప తోటలో నిలిచిన వర్షపు నీరు



కరకగూడెం: పట్టాలపై చేరిన నీటిని తోడుతున్న దృశ్యం



గుండాల: గాలివానకు నేలవాలిన వరిపొలం

మణుగూరురూరల్: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో మండలంలో మంగళవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రాత్రి నుంచి వర్షం కురుస్తుండడంతో వాగులు, వంకలు, పంటల్లోకి భారీగా వరద నీరు చేరుతోంది. ఇప్పటికే కొంతమంది పంటను కోయగా.. మరికొంత మంది కళ్లాల్లో అరబోశారు. ఈ నేపథ్యంలో చేతికొచ్చిన పంట నాశనమైపోతుందేమోనని తలలు పట్టుకుంటున్నారు. తడవకుండా పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. తుఫాన్ ప్రభావం రెండు రోజుల ఉండే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచిస్తున్నారు.

అన్నపురెడ్డిపల్లి: తుపాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా మంగళవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరుపు లేకుండా జోరు వర్షం కురిసింది. వర్షంతో కోత దశలో ఉన్న వరి, చేతికి వచ్చిన పత్తి పంట దెబ్బతిన్నాయి. వీస్తున్న గాలితో మిరప పంటలో నీరు నిలిచింది. కల్లాల్లో ధాన్యం రాశులు తడవకుండా రైతులు పరదాలను కప్పారు. ధాన్యం రాశుల వద్ద నీరు చేరడంతో రైతులు నీటిని తొలగిస్తున్నారు. రోజంతా కురిసిన వర్షంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. తుపాన్‌తో కురుస్తున్న వర్షం వల్ల అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

గుండాల: బంగాళఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాన్ గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో మంగళవారం తెల్లవారు జామునుంచి ఎడతెరిపిలే కుండా కురుస్తోంది. దీంతో చేతికొచ్చిన పంటలు పూర్తి స్థాయిలో దెబ్బతింటున్నాయి. పత్తి, మొక్కజొన్న, వరి చేన్లు చేతికొస్తుండగా ఇప్పుడిప్పుడే రైతులు కోతలు ప్రారంభిస్తున్నారు. కాగా అకాల వర్షంతో పాడవుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికే మొక్కజొన్నలు కల్లాల్లో ఆరబోయగా నిన్నటి నుంచే మబ్బులు పడుతుండడంతో పట్టాలు కప్పుకుని కాపాడుకుంటున్నారు. కొన్ని చేలు నేలమట్టం అయ్యాయి. ఇక చేనుపై తీసేందుకు సిద్ధంగా ఉన్న పత్తి నేలపాలైంది. వరి చేన్లు సైతం కిందపడిపోయాయి. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో వానకొంప ముంచిందంటూ ఆందోళనలు చెందుతున్నారు.

దమ్మపేట: మండల వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా జోరుగా వర్షం కురిసింది. తుపాన్ కారణంగా సోమవారం తేలిక పాటి వర్షం రోజంతా కురవగా, మంగళవారం వర్షం తీవ్రత ఎక్కువై భారీ వర్షం కురిసింది. రోజంతా ఆగకుండా వర్షం పడటంతో, జనాలు తమ అవసరాల నిమిత్తం బయటకు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్డు పక్కన ఉన్న డ్రెయినేజీల్లో నీటి ప్రవాహం పెరిగింది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో, వరి, వేరు శనగ రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట, చేతికివచ్చే సమయంలో నష్టం జరుగుతుందేమో అని భయాందోళనలకు గురయ్యారు. ధాన్యపు రాశులు తడవకుండా, రైతులు టార్పాలిన్ పట్టాలు కప్పినప్పటికీ, అక్కడక్కడా స్వల్పంగా తడిచాయి.

ములకలపల్లి: ములకలపల్లి మండలవ్యాప్తంగా మంగళవారం రోజంతా జల్లులు కురుస్తూనే ఉన్నాయి. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానలకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో జన జీవనం స్థంభించింది. జల్లులకుతోడు ఈదురు గాలు వీచడంతో వాతావరం ఒక్కసారిగి చల్లగా మారిపోయింది. కల్లాల్లోని ధాన్యాం తడిసిపోకుండా రైతన్న తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. టార్పాలిన్ పట్టాలు కప్పి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేశారు. గాలులకు అక్కడక్కడా వరిచేలు నేలవాలాయి.

చర్ల: చేతికందిన పంట చేజారి పోతోందంటూ ఏజెన్సీ రైతాంగం ఆవేదన చెందుతోంది. అప్పులతో కాలం గడుపుకుంటూ వస్తున్న రైతాంగానికి ఇప్పుడు వచ్చిన తుపాన్ మూలుగుతున్న నక్కపై తాడిపండు పడ్డ చందంగా మారింది. చర్ల మండలంలోని సుమారు 33 వేల ఎకరాల్లో రైతులు వరి, మిర్చి, పత్తి పంటలను సాగు చేశారు. 18 వేల ఎకరాల్లో వరి, 5400 ఎకరాల్లో పత్తి, 9600 ఎకరాల్లో మిర్చి పంటలను సాగుచేశారు. రైతులు సాగు చేసిన వరి పంటకు సంబంధించి 8 వేల ఎకరాల్లో వరి పంట కోసం ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబోశారు. ఆరబోసిన ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు 5,400 ఎకరాల్లో సాగు చేసిన పత్తి రైతులు, సుమారు 9,600 ఎకరాల్లో మిర్చి వేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.



అశ్వారావుపేటరూరల్: రహదారిపై పడిన భారీ వృక్షం



అశ్వారావుపేటరూరల్: కేశప్పగూడెంలో డబుల్ బెడ్రూం ఇళ్ల చుట్టూ చేరిన వరదనీరు

అశ్వారావుపేటరూరల్: మండల వ్యాప్తంగా తెల్లవారుజాము నుంచి మంగళవారం రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. స్థానిక వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తల లెక్కల ప్రకారం అశ్వారావుపేటలో 63.5 మీ.మీటర్ల వర్ష పాతం నమోదైంది. అశ్వారావుపేట మండలంలో 7వేల ఎకరాల్లో వరి, సుమారు 2వేల ఎకరాల్లో వేరుశనగ, దాదాపు 200 ఎకరాల్లో మిర్చి పంటలు సాగులో ఉన్నాయి. తుఫాను కారణంగా వివిధ గ్రామాల్లో చేతికందే దశలో ఉన్న మిర్చి, వేరుశెనగ పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. వేరుశనగ పంట దాదాపు 600 ఎకరాలకుపైగా కోతలు కాగా పనాలు పంట చేనులోనే ఉండటంతో తడిసిపోయాయి. ఇదే తరహాలో మరో రెండు రోజులు భారీ వర్షం కురిస్తే వేరుశెనగకు బుజు పట్టి, మెలకలు వచ్చి ఆపార నష్టం జరుగుతుందని రైతులు అవేదన చెందుతున్నారు. మరోవైపు మిర్చి పంటను సైతం వర్షం కమ్ముకుంది. ఇప్పటి వరకు ఎకరానికి రూ.1లక్షా 20వేల వరకు పెట్టుబడి పెట్టామని, తుఫానుతో భారీగా నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నారంవారిగూడెం కాలనీ-నారంవారిగూడెం వెళ్లే మార్గంలో భారీ వృక్షం రహదారిపై అడ్డంగా పడిపోగా, కేశప్పగూడెంలోని కేసీఆర్ కాలనీలోగల డబుల్ ఇళ్ల చూట్టు వరదనీరు పొటెత్తింది. దాంతో కాలనీ వాసులు వరదనీటితో అవస్థలు పడాల్సి వస్తుంది. వాగొడ్డుగూడెం వద్ద ఉన్న వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దాంతో లోలెవల్ చప్టా మునిగి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కరకగూడెం: తుపాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా మంగళవారం ఎడతెరపి లేని వర్షం కురిసింది. రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. ఒక వైపు ఇప్పటికే కోసిన ధాన్యం కల్లాల్లో ఉండగా, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం సైతం వర్షాలకు తడిసి ముద్దయింది. రైతులు ధాన్యాన్ని ఎండ వస్తే ఆరబోస్తూ, వాన వస్తే తడవకుండా టార్పాలిన్స్ కప్పుతూ కన్నీరుపెడుతున్నారు. మరో వైపు పలుచోట్ల వానకు చేనుపైనే వడ్లు రాలిపోవడంతో చేతికొచ్చిన పంట నేల పాలైంది.దీంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

చంద్రుగొండ: తుపాన్ ప్రభావంతో మంగళవారం మండలంలో కురుస్తున్న వర్షాలు రైతులపాలిట శాపంగా పరిణమించాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో వరి, పత్తి, మర్చిపంటలకు నష్టం వాటిల్లుతోంది. మండలంలో వరి 3వేల ఎకరాలు, పత్తి 8వేల ఎకరాల్లో, మిర్చి 6వేల ఎకరాల్లో రైతులు పంటలు సేద్యం చేశారు. ఇప్పటి వరకు పదిశాతమే వరికోత అయింది. కోతదశకు చేరుకున్న వరిపంట వర్షానికి నేలపాలౌతుంది. దీంతో అన్నదాతలు కన్నీరు పెడుతున్నారు. తీసే దశలో ఉన్న పత్తిపంట తడిసి ముద్దవుతుంది. పూతపిందదశలో ఉన్న మిర్చిపంటకు వర్షాలు నష్టం చేకూరుస్తున్నాయి. అధికారులు సత్వరమే స్పందించి పంటనష్టంపై సర్వేలు చేపట్టాలని రైతుసంఘాలు కోరుతున్నాయి.

దుమ్ముగూడెం: మిచాంగ్ తుపాను ప్రభావంతో మండలం వ్యాప్తంగా సోమవారం రాత్రి నుంచి ఏకధాటిగా జోరువాన కురుస్తోంది. మండలంలో పంటలు చేతికందే సమయంలో వర్షం పడుతుండటంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు. వరి పంటలు కోసి కల్లాల్లో ఆరబెట్టి ఉండగా మరికొన్ని చోట్ల రాశులు పోసిన సమయంలో ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి ధాన్యం కాపాడుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతవరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తుండటంతో రైతన్నలు తీవ్ర దిగాలు చెందుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి..

మండలంలో మిచౌంగ్ తుపాను ప్రభావంతో గత రెండురోజులగా కురుస్తున్న వర్షంతో మండల రైతాంగం తీవ్రంగా నస్టపోతుందని, అధికారులు తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సీపీఐ మండలసహాయ కార్యదర్శి తాటి పూడి రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కల్లాలలో ఉన్న ధాన్యం నిల్వల్లో వర్షపు నీరు చేరిందని, మరోరెండు రోజులు తుపాను ప్రభావం ఇలానే ఉంటే ధాన్యం మొలకలు వచ్చే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



చంద్రుగొండ: నీళ్ల పాలైన వరిపంట



గుండాల: చేనులో తడిసిపోతున్న చేతికొచ్చిన పత్తిపంట



చర్ల: కల్లాల్లో ఆరబోసిన ధాన్యంపై తడవకుండా కప్పిన పట్టాలు



కరకగూడెం: వర్షానికి తడవకుండా ధాన్యం బస్తాలను తరలిస్తున్న రైతులు

దుప్పట్లు, సోలార్ లైట్ల పంపిణీ

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్కగూడ సీఆర్పీఎఫ్ క్యాంపు పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలకు సివిక్‌యాక్షన్ కార్యక్రమంలో భాగంగా దుస్తులు, సోలార్ లైట్లను మంగళవారం పంపిణీ చేశారు. సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు జి.సాకేత్ కుమార్ సింగ్, సునీత్ కుమార్ రాయ్ పర్యవేక్షణలో 217 బెటాలియన్ అధికారులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సోలార్ దీపాలు, చీరలు, దోమతెరలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వారితో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు సహాయసహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో క్యాంపు సీఆర్పీఎఫ్ అధికారులు, జవాన్లు పాల్గొన్నారు.



మహిళకు దుప్పట్లు అందజేస్తున్న సీఆర్పీఎఫ్ అధికారి

నేటి నుంచి గోశాల ప్రారంభోత్సవాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని శ్రీనృసింహ సేవా వాహిని ఆధ్వర్యంలో నిర్మించిన గోశాల ప్రారంభోత్సవాలను ఈ నెల 6 నుంచి 10 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ణ చైతన్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోజురోజుకూ గోవులకు ఆదరణ తగ్గుతున్న క్రమంలో గోమాత ప్రాముఖ్యతను లోకానికి చాటి చెప్పేందుకు అద్భుతమైన గోశాల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ లక్ష్మీనారసింహ హోమం, సుదర్శన హోమంతో పాటు శ్రీ మహాలక్ష్మి యాగాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రతి రోజు భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

ఐటీడీఏ పీఓకు సన్మానం



పీఓను సత్కరిస్తున్న మణుగూరు డీఎస్పీ, ఇతర అధికారులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్‌ను మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు మంగళవారం పీఓ ఛాంబర్‌లో ఘనంగా సన్మానించారు. పినపాక నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినందుకు గాను పీఓను ప్రత్యేకంగా కలిసి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పీఓ ప్రతీక్ జైన్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించిన పినపాక నియోజకవర్గ అధికారులను ప్రసంశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాఘవరెడ్డి, మణుగూరు డీఎస్పీ, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా జీరో వ్యాపారం

- భద్రాచలం నియోజకవర్గంలో బిల్లులు ఇవ్వని వ్యాపారులు
- సాధారణ పేపర్‌పై రాసిస్తున్న వైనం
- పన్నుల ఎగనామానికి జిమ్మిక్కులు..



భద్రాచలం పట్టణంలో కాగితంపై బిల్లు రాసిచ్చిన ఓ వ్యాపారి (ఫైల్)



భద్రాచలంఅర్బన్: వినియోగదారుల రక్షణ చట్టం భద్రాచలంలో సక్రమంగా అమలు కావటం లేదు. ఫలితంగా వస్తువులను కొనుగోలు చేస్తున్న వినియోగదారుడు తీవ్రంగా నష్టపోతున్నాడు. కంప్యూటర్ బిల్లులు సరికదా మ్యానువల్ బిల్లులు కూడా ఇవ్వటం లేదు. దీంతో ట్యాక్స్‌లు, జీఎస్‌టీలు, వినియోగదారుల సేవలను అందించకుండా కొందరు వ్యాపారస్తులులాభాలు గడిస్తున్నారు. ఎవరైనా ఎక్కడైనా, వ్యాపారం చేసుకోవచ్చనేది చట్టం చెబుతోంది. భద్రాచలం పట్టణంతో పాటు నియోజకవర్గంలో ఉన్న ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు చెందిన వారు ఇక్కడ తిష్ట వేస్తున్నారు. కాని వినియోగదారులను మోసం చేస్తూ లాభాలు గడిస్తున్నట్లు తెలుస్తోంది.

అంతా తెల్ల కాగితాలపైనే..

భద్రాచలం పట్టణంలోని షాపింగ్ మాల్స్, నియోజకవర్గంలోని దుస్తులు, బంగారు, స్టీల్, సిమెంట్, కిరాణా దుకాణదారులు బిల్లులు ఇవ్వడం లేదని తెలుస్తోంది. వినియోగదారుడు అడిగితే తప్ప ఇవ్వడం లేదని, అడగకుంటే తెల్ల కాగితంపై రాసిస్తున్నారని సమాచారం. ఎవరైనా ఇదేంటని అడిగితే ఎస్టిమేట్ బిల్లు అంటూ బుకాయిస్తున్నారు. ఈ తెల్ల కాగితాలపై తీసుకున్న వస్తువుల పేర్లు, దుకాణం పేరు, టీఓటీ, వ్యాట్ రిజిస్టర్ నంబర్లు కనిపించవు. బిల్లులు ఇస్తే ట్యాక్స్‌తో వస్తువుల ధర పెరుగుతుందని కొనుగోలుదారులకు చెబుతుండటంతో వారు కూడా అడగడం లేదని తెలుస్తోంది.

హోల్‌సేల్ వ్యాపారమూ అంతే..

భద్రాచలం పట్టణంతో పాటు చర్ల, దుమ్ముగూడెం మండలాలలో బంగారం, చీరల వ్యాపారం అధికంగా జరుగుతుంది. వందల సంఖ్యలో దుకాణాలు ఉండగా, నిత్యం రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతుంది. దుకాణాల వద్ద సందడి జాతరను తలపించేలా ఉంటుంది. చర్ల, దుమ్ముగుడెంలో హోల్‌సెల్, రిటైల్ దుకాణలు నిర్వహించే వారు ఇక్కడి నుంచి సరుకులను దిగుమతి చేసుకుంటారు. బియ్యం, నూనే, చిరుధాన్యాల హోల్‌సెల్ వ్యాపారం కూడా జరుగుతోంది. వీటికి సంబంధించి బిల్లులు మాత్రమే దుకాణాల్లో ఇస్తుండగా, సరుకులు గోదాంల నుంచే సరఫరా చేస్తారు. ఇలా బిల్లులు ఇవ్వకపోవడం వల్ల నకిలీ వస్తువులు అంటగడితే వినియోగదారులు దుకాణాల నిర్వాహకులను అడిగే అవకాశం ఉండదు.

టపాసుల అమ్మకాల్లోనూ ఇదే తంతు..

ఇటీవల జరిగిన దీపావళి పండుగ సందర్భంగా భద్రాచలం పట్టణంలో టపాసుల వ్యాపారం అక్రమాలకు లక్షలు ఆర్జించి పెట్టింది. అధికారులు పట్టించుకోకపోవడం, కొందరు పెద్దల అండతో ఈ వ్యాపారం మూడు చిచ్చుబుడ్లు.. ఆరు రాకెట్లుగా విస్తరిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టపాకాయలు నిలువ చేయాలన్నా, విక్రయించాలన్నా, ఒక చోటి నుంచి మరొక చోటికి తరలించాలన్నా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జాగ్రత్తలు, అనుమతులు తీసుకోవడం తప్పనిసరి. అయితే, ఇవేవీ పాటించకుండానే ఇక్కడ ప్రతి ఏటా లక్షల రూపాయల్లో భద్రాచలంలో వ్యాపారం జరుగుతోంది.

నిద్రానవస్థలో అధికారులు..

అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాల్సిన నిఘా వ్యవస్థ నిద్ర పోతుండడంతో భద్రాచలం నియోజకవర్గంలోని భద్రాచలం, దుమ్ముగుడెం, చర్ల మండలాలలో జీరో దందా జోరుగా సాగుతోంది. పలువురు వ్యాపారులు లక్షల రూపాయల లావాదేవీలను సైతం తెల్ల కాగితాలపై నిర్వహిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. విషయం తెలిసినా సంబంధిత శాఖ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నట్లు తెలుస్తోంది.

అడిగితేనే బిల్లు ఇస్తున్నారు..



భద్రాచలం పట్టణంలో ఎక్కడ ఏ వస్తువును కొనుగోలు చేసినా ఆయా దుకాణాల నిర్వహకులు ఎక్కువ శాతం అగిడితేనే గానీ బిల్లు ఇవ్వడం లేదు. ఒక వేళ ఇచ్చినా అది సాధారణ తెల్లకాగితం పైనే రాసి ఇస్తున్నారు. అదేంటి అని అడిగతే మేము అందరికీ ఇవే బిల్లు ఇస్తున్నాము అని సమాధానం ఇస్తున్నారు. హోల్‌సేల్ దుకాణాల్లో అసలు బిల్లులే ఇవ్వడం లేదు. అధికారులు దృష్టిసారించి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలి.

– పరిమి శ్రీనివాసరావు, భద్రాచలం

అక్రమ దందా నిర్వహిస్తే చర్యలు



బిల్లులు లేకుండా ఎలాంటి దందాలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అక్రమ వ్యాపారాలు చేస్తూ ప్రభుత్వానికి పన్ను ఎగవేయడం చట్టరీత్యా నేరం. ఇకమీదట వ్యాపార సంస్థల్లో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తాం. తనిఖీల సందర్భంగా వ్యాపారంలో అక్రమాలు ఉన్నట్లు తేలితే నిర్ణీత పన్నుతోపాటు వందశాతం జరిమానా విధిస్తాం.

– ఆర్ఎల్ మేరి, అసిస్టెంట్ కమిషనర్, స్టేట్ ట్యాక్స్, భద్రాచలం